ఓం నమోభగవతే శ్రీ రమణాయ
శ్రీ భారతీ దేవ్యై నమః

ఉమాసహస్రము

(చతుర్థ శతకమున – చతుర్థ స్తబకము)

షోడశ స్తబకము

అవ:- పదునారవదియగు, కుమారలలితా వృత్తనిబద్ధము అగు స్తబకము- ప్రారంభింపఁబడుచున్నది. యోగానుభవమునకు అను రూపమగుస్తుతి – పూర్వ స్తబకమునందు వలె యిచ్చటను గావింపఁబడుచున్నది.

మూ॥ మహోవిహతమోహం మహేశ మహిలాయాః
స్మితం వితనుతాన్మేగృహేషు మహమగ్ర్యమ్ ॥ 1

తేజస్సుచేఁ దొలఁగింపఁబడిన మోహముగలదియగు మహేశ్వరీ మంద హాసితము – నా గృహములయందు ప్రశస్తమగు నుత్సవమును విస్తరింపఁజేయునుగాత!

ప్రభ:- మోహము – అనాత్మయందుగు నాత్మాభిమానము – అసత్యమగుజ్ఞానము, గృహములయందు' అనుచో నున్న బహువచనము వలన ''నేను ఎచ్చట నెచ్చట వసించుచుందునో, అక్కడనక్కడ, మోహమును తొలగించునదియగు మహేశ్వరీ మందహాసితము యొక్క కార్యమగు మహోత్సవము నాకు లభించునుగాత'' అను భావ మేర్పడుచున్నది. నాయందు ప్రసరించిన మహేశ్వరీమందస్మిత విలసితము చేత దూరీకృత మోహమగు మహోత్సవము నేనున్న స్థలములందంతటను గూడ ప్రచలితమగుఁగాత మనునర్థము గమ్యమగుచున్నది.

మూ॥ ఇయద్ బహులగోలం జగల్లఘుదధానా
సితామహముఖైరప్య ఖణ్డితవిధానా॥ 2

ఇట్లు ఇంత బహుళగోళమగు జగత్తును తేలికగా భరించుచున్నదియు, పితామహాదుల (బ్రహ్మాదుల) చేతఁగూడ ప్రతిహతము కాని కార్య విధానముగలదియు (అగు ఉమాదేవి – నాకు చాలినంత బలమునిచ్చుఁగాక !) అయిదవశ్లోకముతో నన్వయించునది.

ప్రభ:- విశాల దృష్టితో హస్త నిర్దేశము చేత ప్రదర్శించి ' ఇంత' అని చెప్పుచున్నాఁడు' అని గ్రహించునది. ఆకాశమున నక్షత్రమువలెఁ గనఁబడుచు, లెక్కకురానన్ని భువనగోళములు గల యీ జగత్తునంతను శ్రమలేకుండ భరించుచు, బ్రహ్మాదులగు నధికారులచేత నాటంకము చేయఁబడని శాసనము గల మహేశ్వరి నాకు చాలినంత వీర్యము నొసఁగుఁగాత! అని యర్థము.

మూ॥ అదుష్ట చరితేభ్యః, శుభాన్యభిదధానా
కులాని మలినానాం హతాని విదధానా ॥ 3

దోష దూషితములు కాని యాచారములు గల శిష్యులకు మంగళములను వచించునదియు, పాపాత్ముల కులములను నశింపఁజేయునదియు (అగు నుమ– నాకు చాలినంత బలమునిచ్చుగాత!)

ప్రభ:- 'వచించునది' అనగా సంఘటించునది యనియే యర్థము గ్రహింపవలయును గాని చెప్పునదియని గ్రహింపఁగూడదు.

మూ॥ దుకూలమరుణాంశు ప్రభం పరిదధానా
హరస్య రజతాద్రిక్షితీశితురధీనా ॥ 4

బాలసూర్యకాంతి సదృశమగు (ప్రాతస్సంధ్యారాగ రంజితమగు) దుకూలమును ధరించి రజతగిరి (కైలాస) నాథునకధీనయైన ఉమనాకు చాలినంత బలమునిచ్చుగాత!

ప్రభ:- రజతాద్రి (వెండికొండ) నేలుచున్న తెల్లనిమేనుగల హరునికి రాగము నుదయింపఁజేయుటకు - అరుణవసనము సమర్థమగును. కావున మీఁదిశ్లోకము నందలి - రజత - అరుణపదప్రయోగము - ఔచిత్య ప్రకర్షకమని తెలియునది.

మూ॥ మునీంద్రకృతతంత్ర ప్రసిద్ధ బహుదానా
ఉమాబలమలం నస్త్వనోత్వతులమానా ॥ 5

ఋషి శ్రేష్ఠుల చేత విరచితములగు తంత్రశాస్త్రముల యందు ప్రసిద్ధమగు, అమితదానము గలదియు, సరిలేని పరిమాణము గలదియు (అప్రమేయయు) అగు ఉమ- నాకు చాలినంత బలమునిచ్చుగాత!

ప్రభ:- మునీంద్రుల వాక్కులు వ్యర్థములు కావు. వారు రచించిన తంత్ర శాస్త్రగ్రంథముల యందీయుమ - భక్తుల యభీష్టముల నెల్ల నొసఁగునను నంశము ప్రసిద్ధమైయున్నది. ఈ యుమాస్వరూపమును నిశ్చయించుటకు వీలుపడదు. కావున సంపూర్ణశక్తి యగు ఆపరమేశ్వరి ఉమ - నాకు బలమును సంఘటించుగాత! **2,3,4** శ్లోకముల యర్థముతో జేర్చి యీ అయిదవ శ్లోకమునందలి యర్థమును సమన్వయింపవలయును.

మూ॥ నిరస్తవిషయాం యద్ దధాతిమతికీలామ్
సమస్తజగదీశే ధృతి స్తవమ తేయమ్ ॥ 6

సమస్తభువనేశ్వరీ! శబ్దాది విషయములను నిరసించునదియగు బుద్ధిజ్వాలను ధరించుటయే - నిన్ను ధరించుట. (నీ యొక్క ధృతి) అని మతము.

ప్రభ:- శబ్ద - స్పర్శ - రూప - రస - గంధములు **5**ను విషయములని చెప్పఁబడును. నిరసించుట యనగా, నిరాకరించుటయని యర్థము. **నిర్విషయమగు బుద్ధిని విరామము లేకుండునట్లు ధరించుటయే పరమేశ్వరిని ధరించుట అని తాత్పర్యము.**

మూ॥ శ్రుతా ప్రవణచిత్తం స్మృతా నరమపాపమ్
ధృతాహృది విధత్సే గతస్వపరభావమ్ ॥ 7

నీవు - శ్రుతవై - మనుష్యుని ప్రవణచిత్తునిగను, స్మృతవై - పాప రహితునిగను, హృదయమునందు ధృతవై, స్వ-పరభావశూన్యునిగను చేయు చుందువు.

ప్రభ:- ''నిన్ను గుఱించి వినువాఁడు - నీయందాసక్తుఁడును, నిన్ను స్మరించువాఁడు - నిరాకృతపాపుఁడును, నిన్ను హృదయమున ధ్యానించువాఁడు- తాను - పరుఁడు అను భేదబుద్ధిని విడుచువాఁడును అగును'' అని భావము.

మూ॥ అహంమతితటిన్యాః సతామవని! మూలమ్
త్వమేవకిల సేయం మహర్షిరమణోక్తిః ॥ 8

సజ్జనపాలనీ! అహంమతియను స్రవంతికి మూలము నీవే యగుదువట! ప్రసిద్ధమగునిది - మహర్షి రమణోక్తి.

ప్రభ:- 'నేను' అనుబుద్ధి- యుదయించు చోటు చిత్ స్వరూపము - అని అస్మద్గురువు రమణమహర్షి యుపదేశము. స్రవంతికి (నదికి) జన్మస్థానము - అచలమే (కొండయే) యగును. కావున స్రవంతీ శబ్దసామర్థ్యము వలన అహంకారమూలము- అచలము (చలింపనిది) అనునర్థము - ఆక్షేపింపఁబడుచున్నది. అహంమూలాన్వేషణము వలననే జ్ఞానప్రాప్తి కలుగునని భావము. ''అహమితిస్ఫురతిః క్వనువిభాసతే ఇదమనుస్మర సపదిలీయతే'' అని రమణోపదిష్టముగదా!

మూ॥ అహం మతిలతాయా స్త్వయీశవధు కస్తే!
స్థితోఽమ్బ! భువనస్య ప్రవిన్దతి రహస్యమ్ ॥ 9

ఈశ్వరకాంతవగు నంబా! అహంమతియను లతకు కందమగు (దుంపవగు) నీయందు వసించుయోగి – ప్రపంచ రహస్యమును దెలిసికొనును.

ప్రభ:– అహంమతి – 'నేను' అనుబుద్ధి, అదియే లతగా రూపింపఁబడినది. కందమనఁగా, దుంప, లేకమూలము, అనునర్థములు గలవు. నేననుబుద్ధికి మూలము చిత్ స్వరూపమగు నీవే యగుదువు. చిత్స్వరూపమగు నీయందున్న యోగికి లోకము యొక్క వాస్తవమగు తత్త్వము తెలియునను నీయర్థము – అహంధీ – లతలకును – అంబా– కందములకును గల తాద్రూప్యము చేతఁ దెలియఁజేయఁబడినది.

మూ॥ యదేత దఖిలాప్బ! ప్రసిద్ధమివదృశ్యమ్
తవైవకిలజాలం గతోభణతి మూలమ్ ॥ 10

సకలజననీ! ప్రసిద్ధము (నిశ్చితము) వలె దృశ్యమగుచున్న యీ ప్రపంచమును, అహంమతి మూలమును సాక్షాత్కరించుకొనిన యోగి – నీకు సంబంధించినదే యగు జాలమని (జాలవిద్యయని, మాయయని) చెప్పుచున్నాఁడు. కావుననే యతఁడు ప్రపంచ రహస్యమును దెలిసినవాఁడగుచున్నాడు.

ప్రభ:– నేను అను బుద్ధికి మూలమగు స్వరూపము నొందిన యోగి, ఈ దృశ్యమంతయు నిశ్చితసత్యము వలె భాసించుచున్ననూ– ఇది కేవలమును మాయికమేయని తెలిసికొనుచుండును. కావుననే యట్లు చెప్పుచున్నాఁడు. కావుననే ''ప్రపంచ రహస్యమును తెలిసికొనును.'' అను పూర్వశ్లోకార్థమును దీనితో నన్వయింపవలయును.

మూ॥ ప్రపశ్యతి పరాచీ జగద్ వివిథభేదమ్।
స్వతః కిమపినాస్యత్ ప్రతీచిపురతసే ॥ 11

అమ్మా! నీవు బహిర్ముఖివై, జగత్తును వివిధ భేదముగా వీక్షించుచున్నావు. ఓ యంతర్ముఖీ! నీయెదుట – నీకంటె (స్వరూపము కంటె – ఆత్మకంటె) ఇతర మేదియు లేదు.

ప్రభ:– నీవు పరాగ్ దృష్టివై (వెలుపలఁ జూచుదానవై) నానారూపమగు భేదమును జూచుచున్నావు. కావుననే ప్రపంచ స్థితి కలుగుచున్నది. అంతర్దృష్టి (లోచూపుగలదాన) వగునపుడు సర్వమును నీవే యగుచున్నావు. నీకంటె వేరయిన వస్తువేదియు లేదని భావము.

మూ॥ స్తుతా భవసి శశ్వత్ స్మృతాచ భజసే త్వమ్
ధృతా భవసియోగే తతాభవసి బోధే ॥ 12

నీవు భజనమునందు స్తోతలచే స్తుతవును, ఎల్లప్పుడును ధ్యాతలచేస్మృతవును, యోగము నందు యోగులచే ధృతవును, జ్ఞానమునందు జ్ఞాతల చేత తతవును, అగుచున్నావు.

ప్రభ:– స్తుతవు = వినుతింపఁబడిన దానవు
స్మృతవు = స్మరింపఁ బడినదానవు.
ధృతవు = ధరింపఁబడిన దానవు.
తతవు = వ్యాపించిన దానవు.

అవ:– మీఁదఁ దెలుపబడిన స్తుతి – స్మృత్యాదుల వలనఁ గలుగు ఫలమీ క్రిందిశ్లోకముచేఁ జెప్పబడుచున్నది.

మూ॥ స్తుతా దిశసి కామం
స్మృతా హరసి పాపం
ధృతా౽స్య ధికశక్త్యై
తతా భవసి ముక్త్యై ॥ 13

స్తుతవై యభీష్టము నిచ్చెదవు.
స్మృతవై పాపమును హరించెదవు.
ధృతవై అధికశక్తి నొసంగెదవు.
తతవై మోక్షమును ఘటించెదవు.

ప్రభ:- నిన్ను స్తుతించిన స్తోతకు గోరికను దీర్చెదవు. నిన్ను ధ్యానించిన ధ్యాతను పవిత్రీకరించెదవు. యోగము చేత నిన్ను ధరించిన యోగికి సమృద్ధమగు శక్తిని ఘటించెదవు. జ్ఞాన సిద్ధికై వ్యాపించుదానవై జ్ఞాతకు మోక్షమును సాధించెదవు. స్తోత్రము – అభీష్టదము. ధ్యానము – పాపఘ్నము. యోగము – శక్తిదము. జ్ఞానము – ముక్తిప్రదము. అనునది ఫలితార్థము. (ఉమాదేవిని స్తుతించినవారికి కోరికలు ఫలించును. ధ్యానించిన వారికి పాపములు తొలఁగును. ఉమా స్వరూపమును ధరించిన వారికి గొప్ప శక్తులు కలుగును. వ్యాప్తమగు ఉమాస్వరూపము నెఱిఁగినవారికి మోక్షము కలుగును. అని తెలియునది.)

మూ॥ విశుధ్యతి యతాశీ, ప్రమాద్యతి నశుద్ధః
ప్రమాదరహితస్య స్ఫుటేలనసికజ్జే ॥ 14

ఆహార నియమము గలవాఁడు – విశుద్ధుఁడగును. అట్లు విశుద్ధుడగువాఁడు ప్రమాదము నొందఁడు. ప్రమాదరహితుని సహస్రార కమలము వికసించును. ఆ కమలమునందు నీవు లసింతువు (క్రీడింతువు).

ప్రభ:- నియతమగు నాహారము వలన విశుద్ధియు, విశుద్ధి వలన అప్రమాదమును, అప్రమాదమువలన సాధకుని సహస్రారకమలమున దేవి లసించుటయు, అని యిచట గృహీత – ముక్తరీతి ననుసరించి వస్తుస్తోమము వర్ణింపఁబడినది. కావున ''గృహీత – ముక్తరీత్యార్థ శ్రేణిరే కావలిర్మతా'' అను లక్షణము వలన నిది యేకావళియను నలంకారమగుచున్నది.

మూ॥ స్ఫుటం యది సరోజం నటీవ పటు నాట్యమ్
కరోషి యతబుద్ధేర్గజననిశీర్షే, 15

జగజ్జననీ! సహస్రారకమలము – స్ఫుటమగునపుడు (వికసించునపుడు) యతబుద్ధియగు (మనస్సును వశీకరించుకొనిన) యోగియొక్క శీర్షమున (రంగస్థలమున) నటివలె నిపుణముగా నటించుచుందువు.

మూ॥ శిరోగతమిదం నః ప్రఫుల్లమివపద్మమ్
అనల్పమకరన్దం త్వమమ్బ! భవ భృఙ్గీ ॥ 16

ఓయమ్మా! నామ స్తకమందున్న ప్రఫుల్లమగు ఈ పద్మము అనల్పమగు మకరందము గలదై యున్నది. నీవు మధుకరివి కమ్ము!

ప్రభ:- అనల్పమగు మకరందము – దట్టమయిన తేనె. నీ వాపద్మము నందుండి దానిరసము నాస్వాదింపుమని ప్రార్థించుచున్నాఁడు.

మూ॥ సరోజమతుద న్తీ పిబామ్బ! మకరన్దమ్
మహామధుకరి! త్వం భజేర్మదమమన్దమ్ ॥ 17

అమ్మా! నీవు – ఆ సరోజమును పీడంపకుండ, మధురసమును గ్రోలుము. మహామధుకరీ! (తదాస్వాదనమున నీవు) అధికమగుమదమును (బోధ విశేషమును) బొందుము.

ప్రభ:- అమ్మా! ఆ కమలము – కోమలము. కావున మధువు నాస్వాదించు నపుడు – అది లులితము కాకుండునట్లు నిపుణతమ భృంగివగు నీవు రసమును గ్రహింపగలవు. మఱియు మధువునంతనుగూడ నీవు గ్రహింపగలవు అనునర్థమును మహామధుకరీశబ్ద స్వారస్యమువలన నెఱుఁగునది.

యోగానుభవ విశేషప్రాదుర్భావదశలయందు యోగికి శరీరవ్యధలు కలుగును. కావుననే కోమలమగు కుసుమమును పీడింపకుము'' అని రూపకము చేత మీదియర్థము అనుప్రాణితము.

మూ॥ అమఙ్గలమితః ప్రాఙ్మయేశవధు! భుక్తమ్
ఇతః పరమ మేయే! సుఖాన్యనుభవత్వమ్ ॥ 18

ఈశ్వరప్రియా! అమేయా! ఇంతకుముందు నేను దుఃఖము ననుభవించితిని. ఇఁకమీద నీవు సుఖముల ననుభవింపుము.

ప్రభః:- నీ సుఖము కొఱకు దుఃఖములన్నియు నేననుభవించితిని. నీవానందమయివి. కావున సుఖముల ననుభవింపుమని భావము. జ్ఞానము కలుగుటకు ముందు అజ్ఞానియగు భోక్తచేత కష్టమంతయు ననుభవింపఁబడును. జ్ఞానము కలిగిన పిమ్మట భోక్తృత్వము నశించును. అపుడు పరమేశ్వరియే భోక్త్రియగునని భావము. మూల శ్లోకమున 'మయా' అనుటకు బదులు 'మయి' అను పాఠభేదము కాన్పించుచున్నది. 'మయి' అను పాఠమును స్వీకరించునపుడు క్రిందిభావమేర్పడుచున్నది.

''నీవు నాయందింతకు ముందు – అమంగళము ననుభవించితివి. ఇంకమీఁద సుఖముల ననుభవింపుము. జ్ఞానోదయము కలుగకముందును, కలిగిన తరువాతను గూడనీవే భోక్త్రివి, కావున నాదుఃఖము నీవే యనుభవించితివి.

మూ॥ అహఙ్కృతి వశాన్మేచిదీశ్వరి! పురాభూత్
తవా భవ దిదానీం మమాస్తి నవిభుత్వమ్ ॥ 19

ఈశ్వరీ! ఈదృశమగుజ్ఞానము కలుగుటకు ముందు త్వదీయమగు చిత్తు అహంకృతివశము వలన మదీయమై యుండెను. ఇప్పుడది త్వదీయమైనది. కావున నాకు (చిద్) విభుత్వము లేదు.

ప్రభః:- బోధము కలిగినపిమ్మట మదీయమగు చిత్ ప్రభుత్వము త్వదీయమే యయినదని భావము.

మూ॥ యదాఽభవదియంమే తదాన్వభవ దార్తిమ్
తవేశ్వరి! భవన్తీ భునక్తు శమిదానీమ్ ॥ 20

ఎప్పుడీచిత్తు– అహంకార వశము వలన మదీయమై యుండెనో అప్పుడు వ్యధననుభవించినది. ఈశ్వరీ! ఇప్పుడు త్వదీయమై సుఖముననుభవించుగాత!

ప్రభః:- మమత్వమున దుఃఖము కలుగును. నిర్మమత్వమున సుఖము కలుగును అనునది ప్రసిద్ధమగు సర్వసిద్ధాంతసారము.

మూ॥ కరోత్వియమమన్తా వివాదమధునాఽపి
తథాఽపి పురతస్తే మహేశ్వరి వివీర్యా ॥ 21

మహేశ్వరీ! ఈ యహంత (అహంభావము) ఇప్పటికిని గూడ వివాదమును (వ్యవహారమును) చేయనీ. అట్లొనర్చిననుగూడ నీముందిది– వివీర్యము కాకమానదు.

ప్రభః:- వివాదము = వివిధమగు వాదము, వివీర్యము = పోయిన బలము కలది. (విగతమగు వీర్యము గలది) ఈ యహంతయెక్కడ? నీవెక్కడ? నీయెదుటనిది నిలువఁగలదా? అని భావము.

మూ॥ ఇయంచ తవబుద్ధేర్యతోభవతి వృత్తిః
ఇమామపి కురుస్వాం క్షమావతి! విరోషా ॥ 22

ఈ బుద్ధివృత్తి కూడ త్వదీయమే యగును. కావున క్షమావతీ! ఈ వృత్తినిగూడ విరోషవై (శాంతవై) స్వీకరింపుము.

ప్రభః:- ఈ బుద్ధివృత్తి నీయదియే. దీనిని శాసించుదానవు నీవే. కావున దీనినిగూడ నంగీకరింపుమని భావము.

మూ॥ సుధాబ్ధిరిహమాతః! తరఙ్గశతమాలీ
చిదభ్రపురమత్ర ప్రభాపదమదభ్రమ్ ॥ 23

మాతా! ఇక్కడ (ఈ శరీరమునందు) సుధాసముద్రము తరంగ శతమాళియైశత సంఖ్యాకములగు అనగా అసంఖ్యాములగు తరంగపంక్తులు గలదై యున్నది. ఇక్కడ (ఈ శరీరమునందు) అనల్పమును సర్వతేజో మూలపదమును అగు చిదాకాశపురము (కూడ) ఉన్నది.

ప్రభః:- సుధాసముద్రమనఁగా సహస్రారమే. తంత్రశాస్త్రములయందు సహస్రారము సుధా సముద్రమని వర్ణింపఁబడినది. ''తరంగ శతమాలి'' అను పదము చేత - సహస్రారము యొక్క విలాస విభూతిపరంపర చెప్పఁబడుచున్నది. చిదాకాశపురమనఁగా, బయలువంటి చైతన్యమే యగుపట్టణము. 'దహరము' అను నామమున శ్రుతి ప్రసిద్ధమగు బ్రహ్మపుర మిదియేయని తెలియునది. ఇదియే శాస్త్రముల యందు సూర్యమండలముగా నుపదేశింపఁబడిన హృదయమని గ్రహించునది. ఆహారమునకై సుధాసముద్రము నుండి యమృతమును, నివాసమునకై దహరాకాశము వలన నవకాశమును గలుగుచుండును. కావున దేవీ! విజయము నొందుము! అని భావము.

మూ॥ కురుత్వమిదమేకం నిజాలయశతేషు
సవిత్రి! విహరాస్మిన్ యథేష్టమయి దేహే ॥ 24

సవిత్రీ! నీ నివాసభవన శతముల యందు నా యీ శరీరము నొకదానిని గూడ పరిగణింపుము. ఈ దేహమునందు యథేష్టముగా విహరింపుము.

ప్రభః:- నీ నివాస గృహములయందీ నా శరీరమును గూడ లెక్కించి, యిందుఁగూడ స్వచ్ఛందమగు విహారము నొనర్పుమని భావము.

మూ॥ కుమారలలితానాం కృతిర్గణపతీయా
కరోతు ముదమేషా కపర్ది దయితాయాః ॥ 25

గణపతీయమగు నీకుమార లలితావృత్త రచితస్తుతి రూపకృతి- పరమేశ్వర ప్రేయసికి ప్రీతినొసఁగుఁగాత!

ఇతి శ్రీ మహర్షి భగవత్పాదాన్తేవాసినో వాసిష్ఠస్య
నరసింహసూనోః కృతావుమాసహస్రే
షోడశః స్తబకః సమాప్తః
సమాప్తంచ చతుర్థం శతకమ్.

ఇది శ్రీమహర్షి రమణ భగవత్పాదశిష్యుఁడు శఠమర్షణ సగోత్రుఁడు
శ్రీమత్ పంతుల పేరయశాస్త్రి పౌత్రుఁడు వేంకటరామ
బుధేంద్ర పుత్రుడు లక్ష్మీనారాయణ శాస్త్రిచే నాంధ్రీక
రింపఁబడిన ఉమాసహస్రమను స్తోత్రకావ్యమున
పదునారవస్తబకము (నాలుగవ శతకము)

ఓమ్. తత్. సత్.